

# శ్రీ కల్యాణీయం

## – సింగీతం లక్ష్మీ కల్యాణి



*విశేషమైన ఖ్యాతి గడించిన సినీదర్శకుడి భార్య ఐనప్పటికీ ,*

*సాధారణ గృహిణిగా ఎదుగుతూ*

*కుటుంబాన్ని అందంగా తీర్చిదిద్దుకున్న ఓ మహిళ స్ఫూర్తిదాయకమైన ఆత్మకథ..!!*

*(గత సంచిక తరువాయి)*

**అంతే. రాగానే** మంగళ గౌరీ పూజకి కొత్త చీర కొన్నాను! రెండు మూడేళ్ళవరకు మా స్వంత డబ్బుతో కొత్తబట్టలు కొనుక్కునే అసరంలేకపోయింది. భీమవరం వెళ్తే మా అమ్మ, అమ్మమ్మ, రాజమండ్రి వెళ్తే మా పిన్ని మా యిద్దరికీ బట్టలు కొనేవారు. కానీ మూడవ సంవత్సరం దీపావళి నుంచి మేమే కొనుక్కోవడం మొదలుపెట్టాము. మొత్తం మీద సంతోషంగా గడుస్తున్న సమయంలో మాకొక ఇబ్బంది పడే న్యూస్. ఇల్లు ఖాళీ చెయ్యమని, ఇల్లుగలవాళ్ళు ఆ ఇల్లు అమ్మేస్తున్నారట. అక్కడ మేము కాక ఇంకా రెండు కుటుంబాలు వున్నాయి. అందులో ఒకరు సినిమా యాక్టరు పెరుమాళ్ళు. ఉన్నట్టుండి మాకు ఇల్లెలా దొరుకుతుంది? మావారి గూడూరు స్నేహితుడు బరోడా బ్యాంక్‌లో పనిచేసే విశ్వేశ్వరయ్య సిఫార్సు వలన టి.నగర్‌లోనే సరోజిని వీధిలో ఒక ఇల్లు దొరికింది. గేటు పక్క సందులోంచి వెళ్తే వెనక నుంచి మా ఇంట్లోకి వెళ్ళేదారి. ఒక వంట యిల్లు, ఒక గది. ఏం చేస్తాం. సమయానికి దొరికింది కదా. ఆ యిల్లు కూడా అన్నిటికీ దగ్గరే. కానీ వీధి ముఖం కనిపించదు. కిటికీలోంచి చూస్తే పక్కవాళ్ళ యిల్లు కనిపిస్తుంది. వాళ్ళు మాట్లాడిస్తూ వుండేవారు. మా యిల్లుగలావిడ అదో మాదిరి. జబ్బు మనిషి. అందర్నీ విసుక్కుంటూ ఉండేది. ఆయన మాత్రం చాలా మంచివాడు. పక్కవాటాలో మా అమ్మమ్మ పుట్టిల్లు అంజూరువాళ్ళ తాలూకు ఉండేవారు. వాళ్ళు మమ్మల్ని బాగా చూసుకునేవాళ్ళు. వాళ్ళకొక్కర్తే అమ్మాయి. అస్తమానం మా యింటికొచ్చి నాతో కబుర్లు చెప్పేది. నేను వచ్చీ రాని తమిళ భాషలో మాట్లాడేదాన్ని. వాళ్ళమ్మ వచ్చి, "రా! కల్యాణిని యిబ్బంది పెట్టకు" అని పిల్చుకు వెళ్ళిపోయేది. ఇల్లు చిన్నదైనా చుట్టాలు చాలా మంది వచ్చేవారు. ఇంతకు ముందున్న ఇంట్లో కూడా మా మామగారు ప్రతి సెలవులకి మనవళ్ళని పిల్చుకుని గుడూరు నుంచి వస్తూండేవారు.

ఒకసారి కె.వి.రెడ్డి గారు మావారితో 'పెళ్ళినాటి ప్రమాణాలు' ఎక్స్‌ట్రా ప్రింట్ ఒకటుంటే చెక్ చేయమన్నారు. అప్పుడు ఆ పిక్చర్‌కి నన్ను జయంతి వారి థియేటరుకు పిల్చుకెళ్ళారు. ఆ థియేటర్‌లో మేమిద్దరమే. రాయల్ షో లాగా అయింది. ఇలాగ మేమిద్దరమే కలిసి చూసే యోగం వుందన్నమాట.

పెళ్ళయిన కొన్నాళ్ళకి నాకు బోర్ కొడ్తుందని మా వారికి రేడియో కొనాలనిపించింది. కానీ డబ్బెక్కడిది? ఆ! జ్ఞాపకం వచ్చిందాయనకి. ఆయన చిన్ననాటి స్నేహితుడు మృత్యుంజయరెడ్డి కావలిలో రేడియో షాపు పెట్టుకున్నాడుగా. వెంటనే మా వారు ఒక సెట్ వాయిదా పద్ధతిలో కొన్నారు. అతను మద్రాసు వస్తే మా యింట్లో భోంచేసేవాడు. రేడియోలో ఏదైనా మిస్టేక్ వస్తే అతన్ని

చూడమనేవారు. అతను రిపేర్ అయ్యాక "శీనూ! నువ్వు పెట్టిన భోజనం వేస్ట్ అవలేదు" అనేవాడు. అతను పాటలు బాగా పాడేవాడట. చిన్నప్పుడు వీళ్ళిద్దరూ లవకుశ నాటకం వేసారుట.

ఒకసారి రాత్రి 9గంటలకి రేడియో వైర్‌లోంచి పొగ వచ్చింది. ఆయనింట్లో లేరు. నాకేం చెయ్యాలో తోచలేదు. ఎవర్ని పిలవనూ? వెంటనే ప్లగ్ ఊడపెరికి ఇంటికి తాళం పెట్టి జయంతి ఆఫీసుకి పరిగెత్తాను. గుండె దడ దడ కొట్టుకుంటోంది. సడన్‌గా నన్ను చూసి మావారు స్టన్ అయ్యారు. అప్పుడు ఆయన 'రాజాదేసింగ్' అనే తమిళ పిక్చరు తెలుగులోకి అనువదించడానికి వాయిస్ రికార్డింగ్ పనిలో వున్నారు. డబ్బింగ్ ఆర్టిస్ట్ డైలాగులు చెప్తున్నారు. నాకు అంతా కొత్తగా అనిపించింది.

ఆ డబ్బింగ్ పిక్చర్ వెనుక ఒక కథ వుంది. సూదిరెడ్డి శంకర రెడ్డి మావారి స్నేహితుడు. ఆనాటి కర్నూలు యం.ఎల్.ఏ శేషశయనారెడ్డి గారి బావమరిది. మావారితో కలిసి కె.వి.రెడ్డిగారి సినిమాలకి, జయంతి పిక్చర్స్‌కి ప్రొడెక్షన్ మేనేజరుగా పనిచేసేవారు. ఆయన భార్య రత్నమ్మ కూడా చాలా మంచిది. నాకు సన్నిహితురాలుగా వుండేది. చాలా సంవత్సరాల తరువాత మా పెద్దమ్మాయి శకుంతల పెళ్ళికి కూడా వచ్చింది. జయంతీ పిక్చర్స్ నిర్మాత పి.యస్.రెడ్డిగారు, శంకరరెడ్డిగారి ఆధ్వర్యంలో ఈ డబ్బింగ్ సినిమా బాధ్యత శంకర రెడ్డికి వదిలారు. 'రాజాదేసింగ్' సినిమాలో యం.జి.ఆర్, భానుమతి, పద్మిని నటించారు. శంకర రెడ్డి డబ్బింగ్ నిర్వాహకం మా వారి చేతిలో పెట్టాడు. తెలుగు మాటల రచయిత, పాటలు శ్రీశ్రీగారు. మా వారు ఆ సినిమా తెలుగులోకి తర్జుమా చేసిన తరువాత దాని పేరు 'దేసింగ్ రాజు కథ', టైటిల్స్‌లో 'డైలాగు డైరెక్షన్' సింగీతం శ్రీనివాసరావు అని వుంటుంది.

ఆంధ్రాలో పెళ్ళయిన సంవత్సరం సంక్రాంతి ఎంత ప్రాముఖ్యమో దక్షిణాన దీపావళి అంత ముఖ్యం.. మా వారి డబ్బింగ్ పని వుండడం వలన దీపావళికి వెళ్ళడం కుదరదని, మేమిద్దరం దసరా పండక్కి భీమవరం వెళ్ళాము. దీపావళికి వుండకుండా ఆయన మాత్రం మద్రాసు వచ్చేసారు. నేను దీపావళి అయిన తర్వాత వచ్చాను.

కొన్నాళ్ళకి నేను నెల తప్పాను. మాకు లేడి డాక్టర్స్ ఎవరూ తెలియదుగా. కె.వి.రెడ్డిగారు మావారికి చెప్పినట్లు డాక్టర్ శాంత సుందరి చేత చెకప్ చేయించుకోడానికని వెళ్తుండేదాన్ని. అలాగ ఒకసారి ఒకావిడతో పరిచయం అయ్యింది. నా పేరు, మా వారి పేరు, ఉద్యోగం అన్నీ అడిగింది. చెప్పాను. నేను ఆవిడని అడిగాను. ఆవిడ పేరు కృష్ణజ్యోతి అని, ఆమె భర్త డబ్బింగ్ ఆర్టిస్ట్ పి.జె.శర్మ అని చెప్పింది. ఆయన సినిమాల్లో యాక్టింగ్ కూడా చేసేవారు. వాళ్ళ పెద్దబ్బాయే ఈనాటి సాయికుమార్. ప్రముఖ నటుడు, హీరో, 'వావ్' ప్రోగ్రామ్ ఏంకర్ కూడా, అసలు అతన్ని కన్నడ వాళ్ళు కర్ణాటక సినిమాలకి ప్రోత్సహించిన తరువాతే తెలుగు చిత్రసీమలోకి వచ్చాడు.

నేనలా అప్పుడప్పుడు లేడి డాక్టర్ దగ్గర చెకప్‌కు వెళ్తూ వస్తుండేదాన్ని. ఒకసారి నేను, మావారు ఒక పెళ్ళికి రాజమండ్రికి వెళదామనుకుని ప్లాను చేసుకున్నాము. మావారి బాబాయిగారి అమ్మాయిని వారి మేనత్త కొడుక్కి యిచ్చి. రెండువైపులా విధాయకం కనుక వెళదామనుకున్నాము. అంటే ఏడవ నెలలో ఎటూ పురిటికి భీమవరం వెళ్ళాలి. రెండుసార్లు ప్రయాణం మంచిది కాదని మామగారు ఉత్తరం వ్రాసారు. అదీ నిజమేగా! వచ్చే నెలలో ఎటూ భీమవరం వెళ్తున్నాగా అని ఊరుకున్నాము.

ఏడవ నెల రాగానే గూడూరు పిలిపించారు మా తోటికోడలు. ఇక్కడ వాళ్ళగురించి చెప్తాను చూడండి. మా తోటికోడలి పేరు సేతుబాయి. అందరూ సేతమ్మ అని పిలుస్తారు. మా బావగారి పేరు ఉడిపి కృష్ణమూర్తిగారు. వాళ్ళకి ఇద్దరు అబ్బాయిలు, ఐదుగురు అమ్మయిలు. ఇవికాక మా సేతమ్మ అక్కకి కొన్ని అబార్షన్లు, ప్రిమెచ్యూరు చైల్డ్ బర్త్స్, డెత్స్‌లాంటివి జరిగాయి. మా బావగారు గూడూరులో రకరకాల బిజినెస్‌లు చేశారు. మా మామగారు సింగీతం రామచంద్రరావుగారు రిటైర్డ్ హెడ్ మాస్టర్ అని ముందే తెలిపాను. ముందు నాకు గూడూరులో పండగ చేయాలని అక్కడికి రప్పించారు. మేమెళ్ళిన మరుసటి రోజున భీమవరం నుండి మా అమ్మ ఆనవాయితీ ప్రకారం మా తోటికోడలుకు, నాకు చీరలు మొదలైనవన్నీ తెచ్చింది నన్ను పురిటికి పిల్చుకెళ్ళడానికి. మా సేతమ్మక్క నాకన్నా పెద్దది. అత్తగారి స్థానంలో వుండి అన్నీ ఆవిడే జరిపించింది. కొత్తలో ఆవిడ దగ్గర ఎందుకో నేను ఫ్రీగా వుండలేక పోయేదాన్ని. ఇన్నేళ్ళ

తరువాత ఇప్పుడు చూడాలి మమ్మల్ని. స్వంత అక్క చెల్లెళ్ళుగా గంటల తరబడి మాట్లాడుకుంటాం. అప్పటి నా జంకు చూసి ఆవిడే అర్థం చేసుకుని నన్ను బాగా చూసుకునేవారు. నా పెళ్ళయి వచ్చేసరికి ఇద్దరు మగపిల్లలు, ముగ్గురు ఆడపిల్లలు. నే వచ్చిన తరువాత మరి ఇద్దరు అమ్మాయిలు. ఆ మూడో అమ్మాయే నా పెళ్ళికి చంటిపాప. అది పెరిగి పెద్దదై, అది కూడా మద్రాసు వాసి అయిపోయింది. పేరు సత్యభామ. ఇప్పుడు యంజి.ఆర్ హాస్పటల్ కాలేజీలో వర్క్ చేస్తోంది. నేను దాంతో అంటుంటాను. "నువ్వు పుట్టి నా పెళ్ళిచేయించావు. నేను ఈ వూరు సంబంధం చూసి నీ పెళ్ళి చేయించాను" అని.

గూడూరులో గాజులు తొడిగించి, పువ్వులు ముడిచే ఫంక్షన్ అయిన తర్వాత మా అమ్మ నన్ను భీమవరం పిల్చుకు వెళ్ళింది. మా నాన్నగారు మధ్య తరగతి కుటుంబం వారైనా కూడా నేను గర్భవతి కదా అని రైలుకి ఫస్ట్‌క్లాస్ బెర్త్ బుక్ చేయించారు. స్టేషన్‌కి మావారు వచ్చారు. మరునాడు ఆయన మదరాసు ప్రయాణం. రైలు కదిలేసరికి నాకు దుఃఖం ఆగలేదు. మళ్ళీ నే రావడానికి అయిదు నెలలు పడుతుంది కదా, మాకా ఎడబాటు తప్పదుకదా! అని, కానీ మా అమ్మ బాధపడ్తుందని అది కనబర్చలేదు.

అన్నట్టు ఒక విషయం మర్చిపోయను. భీమవరం ప్రయాణం కట్టే ముందు మద్రాసులో మా వారిని ఒకటి రిక్వెస్టు చేశాను షూటింగ్ చూపించమని. అంతకు ముందు భీమవరం వెళ్ళినప్పుడే అందరూ అడిగారు. "షూటింగ్ చూశారా? వాహిని స్టూడియో చూశారా?" అని. వాళ్ళకి జవాబు చెప్పుకోడానికయినా చూడాలికదా. మావారు "అవునుకదూ, మర్చిపోయా"నన్నారు. అప్పుడు కె.వి.రెడ్డిగారు విజయా వారి బ్యానర్‌లో ఒక జానపద చిత్రం తీస్తున్నారు. "జగదేకవీరుని కథ." ఆ పిక్చరుకి కూడా మావారు స్క్రిప్టుకి పనిచేశారు. ఆ షూటింగ్‌కి వెళ్ళాము. రెడ్డిగారు మమ్మల్ని సాదరంగా మర్యాద చేసి కూర్చోబెట్టారు. ఋష్యేంద్రమణి అత్తగారు - బి.సరోజాదేవి, జయంతి, యల్. విజయలక్ష్మి, బాల కోడళ్ళు. "ఆదిలక్ష్మి వంటి అత్తగారివమ్మా" అనే పాట చిత్రీకరణ జరుగుతోంది. అది చూసి తృప్తిపడ్డాను.

సరే, భీమవరం వెళ్ళినతర్వాత మా అమ్మవాళ్ళు కూడా పండగ చేశారు. ఎలాగో కాలం వెళ్ళబుచ్చేదాన్ని. ఇరవై మూడేళ్ళు గడిపిన ఆ యింట్లో ఇప్పుడు పొద్దుపోయేదికాదు. మా వారి దగ్గరనుంచి ఉత్తరాలు, నా ప్రత్యుత్తరాలు జరుగుతున్నాయనుకోండి. చుట్టుపక్కల పిల్లలు వస్తూండేవారు. మా సుశీల గుంటూరులో బి.యిడి చదివేది కదా, అది వస్తూ పోతూ ఉండేది. అక్కడి విషయాలు చెప్తుండేది. మా రఖుమ చిన్నది కదా, దాని స్కూలేదో గొడవేదో దాంతో సరిపోయేది దానికి.

నాకు తొమ్మిదో నెల వచ్చింది. ఒకరోజు పొద్దున్న స్నానం చేసి వచ్చి బొట్టు పెట్టుకుంటుంటే మా నాన్నగారు వచ్చి "అమ్మలూ, త్వరగా బొట్టు పెట్టుకునిరా. నా ఫ్రెండ్ ఒకాయన వచ్చారు. ఆయనకు నిన్ను పరిచయం చెయ్యాలి" అని ఆయన రూమ్‌కి పిల్చుకెళ్ళారు. మా నాన్నగారి గది ఒక పక్కగా సపరేట్‌గా వుండేది. ట్యూషన్ పిల్లలు, స్నేహితులు వచ్చినా, ఆయన నోట్స్ రాసుకోడానికైనా, ఎవరితోనైనా మాట్లాడాలన్నా ఆ రూమే. నేను ఆయన వెనకాలే చీర పైట సవరించుకుంటూ వెళ్ళాను. "ఈ అమ్మాయి మా పెద్దమ్మాయండి", అంటూ నన్ను లోపలికి రమ్మన్నారు. ఆశ్చర్యం మరెవరో కాదు. సాక్షాత్తు మా వారే. నాకు ఆశ్చర్యం, ఆనందం రెండూ మిళితమై పోయింది. "ఆ! మీరా" అంటూ పక్కనే కూర్చున్నాను. "అదేమిటీ, నిన్న వచ్చిన వుత్తరంలో కూడా మీరు వస్తున్నట్టు లేదే! ఓహో! ఇది మీ ప్లానా" అన్నాను నవ్వుతూ. మా నాన్నగారు లోపలికి వెళ్ళిపోయారు. "అనుకోకుండా వచ్చాను. నాకే తెలీదు వస్తానని. బెజవాడలో ఒక ఫ్రెండ్ పెళ్ళి వుంటే అటెండ్ అవుదామని బయలుదేరాను. పంపాపతిరావుండి ఎటూ బెజవాడ వరకు వెళ్తున్నావు కదా, అలాగే భీమవరంకు వెళ్ళి నీ వైఫ్‌ని చూసిరా! ఇటువంటి సమయంలో భర్తను చూడాలని అనిపిస్తుంది అని చెప్పాడు" అన్నారు. అబ్బా! ఆయనకి ఎంతైనా థాంక్స్ చెప్పాలి. అప్పటికే అతని పెళ్ళై పోయింది. అతనికా అనుభవం ఏమో అనుకున్నాను. "ఎలాగైతేనేం నాకు ప్లెజెంట్ సర్‌ప్రైజ్‌నిచ్చారు" అన్నాను. మా రఖుమకైతే బావగారు వస్తే ఖుషి, కబుర్లు చెబుతుంటారు. నవ్విస్తూ వుంటారు. సినిమా ప్రోగ్రామ్‌లు వేస్తారు. వాళ్ళిద్దరూ బావా మరదళ్ళైనా తండ్రి కూతుళ్ళ అనుబంధంలా వుండేవారు. అల్లుడొచ్చారని మా అమ్మ, నాన్నగారికి చాలా సంతోషం. మా

అమ్మమ్మకయితే చెప్పడమే అవసరం లేదు. అమితానందం మనవడు వచ్చాడని. మా అమ్మ ముందు గదికి వెళ్ళి మా వారికి కాఫీ ఇచ్చేది. "మీ నాన్నగారేరీ?" అనడగేవారు. "వంటింట్లో కాఫీ తాగుతున్నారు" అని చెప్పాను. "నేనూ అక్కడికే వెళ్తాను" అంటూ వంట యింట్లోకి వెళ్ళి, గుమ్మం మీద కూర్చునేవారు. అప్పుడు మా అమ్మా వాళ్ళు కాఫీలు, వంటలు పీట మీద కూర్చుని, కిందే చేసేవారు. ఈయనక్కడికి వెళ్ళగానే మా అమ్మ సిగ్గుతో పైట సవరించుకుంటూ, మా అమ్మమ్మ విడో కదా, తలమీద ముసుగు చీర సవరించుకుంటూ వుండేవారు. అల్లుడైనా కూడా భేషజాలేవీ లేవని సంతోషించేవారు.

అంతకు ముందొకసారి మేము భీమవరం వెళ్ళినపుడు మా రఖుమ కాలేజీ చదివే రోజులు. ముందు నేను వెళ్ళాను. తరువాత వారు వచ్చారు. వారు వచ్చే విషయం దానికి తెలీదు. మా చెల్లెలు కాలేజీ నుంచి వచ్చే టైం తెలుసుకుని మావారు లుంగీ బనీను వేసుకుని తలకు తువ్వాలు తలపాగా కట్టుకుని బయటికి వెళ్ళారు. అర్థం కాక మేమంతా చూస్తున్నాము. ఆయన ట్రిక్కులు నాకు తెలుసు కనుక ఆయనేం చేస్తారో చెప్పాను. కాలేజికి వెళ్ళాలంటే ఒక వంతెన దాటాలి. కింద నీరు ప్రవహిస్తూ ఉంటుంది. అది ఒక కాలువ. ఈయన వంతెన మీద నిల్చుని కింద నీళ్ళు చూస్తున్నట్లు నటిస్తూ, వెనక్కి తిరిగి గుంపులు గుంపులుగా వచ్చే కాలేజీ విద్యార్థులను చూస్తున్నారు. మా చెల్లెలు తన స్నేహితురాలు కామేశ్వరి అనే అమ్మాయితో మాట్లాడుతూ అప్పుడప్పుడు వెనక్కి తిరిగి చూస్తూ వస్తోందిట. ఆ అమ్మాయి "అదేమిటీ అలా అస్తమానం వెనక్కి చూస్తున్నావు" అని అడిగిందిట. "కాదే, అక్కడ చూడు ఆ లుంగీ కట్టుకున్నాయన్ని చూస్తే ఏదో పరిచయం వున్న ఆయనలా కనిపిస్తున్నాడే" అని అందిట. ఆ కామేశ్వరి ఎవరో కాదు యిప్పటి యువదర్శకుడు వి.యన్.ఆదిత్య అమ్మ. ద్రోణంరాజు బుచ్చినారాయణ మూర్తిగారమ్మాయి. తన భర్త వి.వి.సత్యప్రసాద్ గారు ఎస్.బి.ఐ. ఆఫీసర్గా రిటైరయ్యారు. ఆయన కవి, సాహిత్యాభిలాషి. మావారంటే ఆయనకు చాలా గౌరవం. వాళ్ళబ్బాయి ఆదిత్య 'మనసంతా నువ్వే'లాంటి ఎన్నో హిట్ సినిమాలకు దర్శకత్వం వహించాడు.

రఖుమ ఇంటికొచ్చేసరికి మా వారు ఇంటికొచ్చేసారు. దాన్ని చూడగానే మేమంతా ఘొల్లుమని నవ్వాము. "అదే నేననుకుంటానే వున్నా బావగారిలా వున్నారే అని. కానీ ఇలా లుంగీతో వంతెన మీద ఎందుకుంటారో అనుకున్నా" అంది. ఇలా దాన్ని బాగా ఆటపట్టించేవారు. కామేశ్వరి కూడా నన్నూ వారినీ అక్క, బావగారనే పిలిచేది. ఇప్పుడు కూడా అంతే. పక్కింటి శేషావతారం గారమ్మాయి మంగతాయారు, అలివేలు కూడా అలాగే పిలిచేవారు. కామేశ్వరి కూడా హైదరాబాదు కనుక అప్పుడప్పుడు కలుస్తూవుంటాను. అలివేలుని చాలా సంవత్సరాల తరువాత మా చెల్లెలి కూతురి పెళ్ళిలో చూసాను. ఇప్పటికీ కూడా భీమవరం వాళ్ళనెవరినైనా చూస్తే నాకా ఊరిని చూచినంత సంతోషంగా వుంటుంది.

పెళ్ళయిన తర్వాత అందరు ఆడపడుచుల లాగే నేను కూడా పచ్చళ్ళు, ఆవకాయలు, పొడులు, వడియాలు, భీమవరం నుంచి తెచ్చేదాన్ని. దార్లో గూడూరులో దిగినప్పుడు అక్కడ్నించి కూడా తెచ్చేదాన్ని. నేను పెళ్ళికి ముందు కారం బాగా తినేదాన్ని. పెళ్ళయిన తర్వాత నేను, మావారు భోంచేస్తున్నప్పుడు ఆవకాయ అన్నానికి కలుపుకుని తింటున్నాను. మావారు ఉన్నట్టుండి "అబ్బా ఎంత ఎర్రగా కలుపుకున్నావు, అంత కారం ఎలా తింటున్నావు" అని అడిగారు. ఆవకాయ అన్నం ఎర్రగా కాక ఎలాగుంటుంది? ఆయన చాలా కాలంగా మద్రాసులో వుంటున్న మూలాన అంత కారం తినేవారు కాదు. నాకు ఏడుపు వచ్చింది. కళ్ళల్లో నుంచి నీరు కారుతున్నాయి. తలదించుకున్నాను. అన్నంలో కన్నీళ్ళు పడతాయేమోనని కంచం ముందుకు జరిపాను. ఇవేమీ ఆయన గమనించలేదు. కాసేపుండి అన్నం కదలకపోవడం గమనించి నన్ను చూసారు. కళ్ళ వెంట నీళ్ళు! "అరె! ఏడుస్తున్నావా! నేనేం అన్నాననీ" అని బెరుకుపోయినట్లు, తానేదో తప్పు చేసినట్లు మొహం పెట్టి చాలా నొచ్చుకున్నారు.

నాకు మొదట్లో తెలియలేదు. రాను రాను తెలిసొచ్చింది. ఈయనకి పరధ్యానం ఎక్కువ. అంటే ఎప్పుడూ ఏదో స్టోరీ స్క్రిప్టు ఆలోచిస్తూ వుంటారు. అప్పుడప్పుడు చేతులు ఆడిస్తూ, తానే ఆర్టిస్టులాగా యాక్షన్లు చేస్తూ వుంటారు. ఏదైనా చెపితే వినిపించుకున్నారో

లేదో తెలీదు. చెపితే ఎప్పుడు చెప్పావు. నాకు చెప్పనేలేదు అంటారు. మళ్ళీ మళ్ళీ చెబితే ఎన్నిసార్లు చెబుతావు ఒకసారి చెప్పావుగా అంటారు. ఒకసారి భీమవరం వెళ్ళినపుడు మావారు ఎలా చేసేవారో మిమిక్రీ చేసి చూపించాను. మావారక్కడికి వచ్చినపుడు మాటల్లో మా నాన్నగారు "మా కల్యాణి మిమిక్రీ బాగా చేస్తుంది. ఎవరెలా మాట్లాడ్తారో అలా చెప్తుంది" అనగానే మావారు "నన్ను కూడా మిమిక్రి చేసి చూపించి వుంటుందే" అన్నారట.

అలాగే ఒకసారి దసరాకి వెళ్ళి దీపావళి వరకు వుండి వచ్చేసానని చెప్పానుగా. దసరా కొలువులో మా చెల్లెలితో పాటు పార్కు కట్టడానికి సహాయం చేస్తూ వుండేవారు. మా అమ్మవాళ్ళకి కూడా దసరాకే బొమ్మల కొలువు పెట్టడం ఆనవాయితీ. పేరంటాళ్ళు వచ్చి కూర్చున్నా కూడా బావామరదళ్ళకి ఆ బొమ్మల దగ్గర పార్కు అలంకారం అయ్యేది కాదు. మా వారలా కలిసి మెలిసి అందరితో కలివిడిగా తిరగడం మావాళ్ళకి చాలా సంతోషం.

మా పెళ్ళిరోజున మావారు మా రఖుమని మంచినీళ్ళు అడిగారట. అది తెచ్చి చేతికి ఇచ్చింది. తర్వాత మా నాన్నగారిని "మీ రఖుమ డ్యాన్సు నేర్చుకుందా?" అని అడిగారట. మా నాన్నగారు ఆశ్చర్యంగా "అవును, ఎందుకలా అడుగుతున్నారు", అనడిగితే "అహా! మంచినీళ్ళగ్లాసు ఇచ్చేటప్పుడు ముంచేయి మాత్రం వంగింది తనకి" అన్నారట. ఇది నాకు పెళ్ళయి మదరాసుకొచ్చిన తర్వాత మావారు చెప్పారు నాకు. ఎంత shrewdz, ఎలా కనిపెట్టారో అనుకున్నా.

నేను రెండవసారి భీమవరం వెళ్ళినప్పుడు నాలో వచ్చిన మార్పును చూసి లెక్చరర్స్, మా నాన్నగారి స్నేహితులు ఆశ్చర్యపోయారు. "విఠల్‌రావుగారూ మీ పెద్దమ్మాయి యిపుడు చాలా బాగా మాట్లడ్తోందే" అనేవారట. ఎందుకంటే పెళ్ళికి ముందు నేను చాలా రిజర్వ్‌డ్ ఎవ్వరితోనూ మాట్లాడను. పేరంటానికి మా నాన్నగారి ప్రోద్బలంతోనే వెళ్ళేదాన్ని. అందుకనే నా మార్పు వాళ్ళకు ఆశ్చర్యం వేసింది. మా నాన్నగారు ఆ క్రెడిట్ అంతా వాళ్ళ అల్లుడికి ఇచ్చారు. "మా అల్లుడు దాన్ని లైబ్రరీకి, అతనెక్కడికెళ్తే అక్కడికి పిల్చుకెళ్తారుట. దాంతో దానికి బెరుకుతనం పోయింది" అని గొప్పగా చెప్పుకునేవారు. వీధిలో మెట్ల మీద కూర్చుని చిన్న చిన్న పిల్లల్ని మాట్లాడిస్తే కూడా మా సుశీల "అదేమిటే, ముంగిలా ఉండేదానివి ఇలా మాట్లాడ్తున్నావు ఇదంతా మా బావగారి మహిమే! నిన్ను భలే మార్చేశారే!" అనేది.

నేను పురిటికని ఏడవ నెలలో వెళ్ళానా, మూడు నెలలు ఎలాగో గడిచిపోయింది.. పదవ నెల రాగానే ఫాల్స్ నొప్పులు వచ్చి ఒకరోజు ఆస్పత్రిలో ఉండి వచ్చాను. అది మిషన్ హాస్పిటల్. ఎన్నో డెలివరీలు చేసిందా డాక్టరు. అందుకని నిజమైన నొప్పులొచ్చిన తర్వాత మళ్ళీ చేరాను. ఈసారి నొప్పులెక్కువై ఒక రోజంతా నొప్పులుండి ఆగిపోయాయి. నానా అవస్థలు పడ్డాను. కూర్చోడానికి రాదు, నిల్చోడానికి రాదు. మొతం మీద నార్మల్ డెలవరీ అయి చూస్తే స్టిల్ బార్న్ చైల్డ్. మగపిల్లవాడు. అదే సిటీ హాస్పటల్ అయివుంటే ఏ సిజేరియన్ ఆపరేషనో చేసి ఉండేవారు. డాక్టర్లు అనుభజ్ఞులు కానందున నాకలా జరగలేదు. కానీ నా గురించి భయపడిన డాక్టర్లకి తల్లి బ్రతకడం రిలీఫ్ ఇచ్చింది. నాకో గండం గడిచిందన్నమాట. చంటిపిల్లాడి కోసం ఎదురుచూస్తున్న మా అమ్మ వాళ్ళకి పెద్ద నిరాశ, వాళ్ళ దుఃఖానికి అంతులేదు. మునిమనవడిని చూస్తానని ఆశ పెట్టుకున్న మా అమ్మమ్మకి తీరని దుఃఖం. అక్కడ మద్రాసులో ప్రసవం అయిందని టెలిగ్రాం వస్తుందన్న మా వారికి ఈ విషయం ఒక కార్డు ద్వారా చూసి, పక్షిలా రెక్కలు కట్టుకుని వాలేరు, తిన్నగా ఆసుపత్రికే వచ్చేశారు. అక్కడున్న మా అమ్మకి ధైర్యం చెప్పారు. మర్నాడు మద్రాసు వెళ్ళి పుణ్యాజనానికి పదకొండవ రోజున వచ్చారు. బిడ్డవున్నా లేకపోయినా జరిగే తంతంగాలన్నీ జరగాలి కదా, ఈ సంఘటన 1961 జూన్‌లో జరిగింది. మూడవ నెల రాగానే మద్రాసు వచ్చేశాను. నాతోపాటు మా నాన్నగారు, మా అమ్మమ్మని తోడిచ్చి పంపారు.

నేను మొదటిసారి నెల తప్పినప్పుడు Madly Roadలో ఉండేవాళ్ళం. నేను భీమవరం నుంచి సామాన్లు తీసుకుని వెళ్ళిన గోనెసంచులు అవి ఒక గది అటక మీద వుంచాము. ఆ యింట్లో రెండు మూడు పిచ్చుకలు తిరుగుతూ వుండేవి. మా వారి పెదనాన్నగారు భీమారావుగారు పిచ్చుకలు తిరుగుతూ అవి పిల్లల్ని పెడ్తాంటే ఆయన ముచ్చటపడేవారు. ఇది చాలా మంచి శకునం,

శుభసూచకం అనేవారు. ఆయన కొడుకు దొడ్డశీనుకి పిల్లలు కలగలేదు. మేము కొత్త పెళ్ళైన వాళ్ళం కదా, అస్తమానం పిచ్చుకలని మెచ్చుకుంటూ వుండేవారు.

ఒకరోజు నేను ముందు గదిలో కూర్చుని ఏదో వారపత్రిక చదువుకుంటున్నాను. మా వారు యింట్లో లేరు. పుస్తకం చదువుతున్న నేను అటక మీద నుంచి ఒక గోనెసంచి చివర్లు వేలాడ్డం చూశాను. ఊరుకోక నేను ఒక కర్ర తీసుకుని గోనెని పైకి తోస్తుంటే గోనె జారి దానిలోంచి ఒక పిచ్చుక గుడ్డు కింద పడిపోయి చితికిపోయింది. నాకదోలా అనిపించింది. మా వారికి చెప్పేనో లేదో జ్ఞాపకం రాలేదు. తరువాత ఒక తెలుగు వార పత్రికలో "పిచ్చుక శాపం" అనే కథ చదివాను. అప్పుడనిపించింది, నాకు కూడా పిచ్చుక శాప ఫలితమే బిడ్డ బతకలేదు అని. అప్పట్నుంచి యిప్పటివరకు ఎక్కడ ఏ గూడున్నా దాని జోలికి వెళ్ళను, ఎవ్వరినీ వెళ్ళనియ్యను. శత్రువులకి కూడా ఇలాంటి దుర్ఘటన రాకూడదనుకున్నాను.

నేను పురుడయి వచ్చినా కుడా ఇంకా పిక్చరు మొదలుపెట్టలేదు. కథ కోసం వెతుకుతూనే వున్నారు. నేను మా వారితోపాటు కొన్ని పుస్తకాలు చదివేదాన్ని. కొన్ని పద్యకావ్యాలు కూడా చదువుతూ ఉండేదాన్ని. కొన్నాళ్ళకి నాకెందుకో టీచరు ఉద్యోగం చెయ్యాలనిపించింది. సరే, దగ్గర్లో వున్న పార్క్ మాంటిస్సోరి స్కూల్లో చేరాను. ఆ రోజుల్లో జీతాలు కూడా పెద్ద ఏమి ఉండేవి కావు. ఆ కాలంలో రెండేళ్ళ కొక పిక్చరు, ఇప్పటిలా కాదు. టపాసాసరాలలాగ టపా టపా రిలీజు చెయ్యడానికి. కథ కోసరం వెతుకుతునే ఉన్నారు. మేమున్న ఇల్లు అచ్చిరాలేదని బస్టాండుకి చాలా దూరంలో ఉన్న సి.ఐ.టి నగర్‌లోని ఒక చిన్న ఇండిపెండెంట్ ఇంట్లో చేరాము. నెలకి 65రూ అద్దె, ఆ కాలంలో బస్ స్టాండు నుంచి సి.ఐ.టి నగర్‌కి ఒక బస్సు కూడా లేదు. నడిచి వెళ్ళాల్సిందే ఆ యింటికి వెళ్ళేసరికి పిక్చరు "శ్రీకృష్ణార్జున యుద్ధం" అని తేలింది. ఇల్లు దూరమని స్కూలు మానేశాను. కొన్నాళ్ళకి ఉన్నట్టుండి మా నాన్నగారు వచ్చారు. మా సుశీల పెళ్ళి నిశ్చయమైందని, నన్ను పిలుచుకుని వెళ్ళడానికొచ్చానని అన్నారు. సడన్‌గా ఈ విషయం చెప్పేసరికి నాకేం చెప్పాలో పాలుపోలేదు. "నాన్నగారూ, రేపు మా వెడ్డింగ్ డే థర్డ్ యియర్. మొదటిసారి నే కాన్పుకు భీమవరంలో ఉన్నప్పుడు మీ అల్లుడు రాలేదు. రెండవసారి అబార్షనయి ఆస్పత్రిలో ఉన్నాను. వెడ్డింగ్‌డే చూసుకుని ఎల్లుండి వెళ్దామ"ని అన్నాను. ఆయన సరేనన్నారు. పెళ్ళి తిరుపతిలో అని చెప్పారు. ఈ విషయం అల్లుడితో చెపితే వారు పిక్చరు ప్రారంభించామని, భీమవరం రావడానికి కాదని, తిన్నగా తిరుపతికే వస్తానని అన్నారు. మా నాన్నగారు సరేనన్నారు.

మా చెల్లెలి పెళ్ళికి తిరుపతికి రావడానికి దగ్గర బంధువులు ముందుగానే భీమవరంకే వచ్చారు. మరి కొందరు పెళ్ళి కూతుర్ని చేసేనాటికే వచ్చారు. అక్కడ్నుంచి అందరం కలిసి ప్రయాణం చేశాము. ఒక కంపార్టుమెంటు అంతా మేమే. ఆ రోజుల్లో రిజర్వేషనులు అవీ లేవు. బావగారు, తోడికోడలు మాకందరికీ టిఫిన్లు, కాఫీలు ఏర్పాటు చేసారు. అది పొద్దున్న మూలాన చాలా మెచ్చుకున్నారు. ఇక అక్కడ్నుంచి ఒక స్పెషల్ బస్సు మాట్లాడారు తిన్నగా తిరుపతికి. రైల్లో అందరూ చాలా సంతోషంగా ఉన్నారు. నాకు మాత్రం మా వారు పెళ్ళికి వస్తారో రారో అని దిగులుగా ఉండేది. ఎందుకంటే చెల్లెలు పెళ్ళి మార్చి 30, కానీ మదరాసులో మా వారికి పాట రికార్డింగ్ 31న. ఎలా వస్తానో అని నాకు ఉత్తరం రాసారు. పైగా కె.వి.రెడ్డిగారి పిక్చరాయే. ఆయన చాలా స్ట్రిక్ట్. అసిస్టెంట్స్ ఎవ్వరూ ఆయనకెదురుగా కూర్చోరు. మావారూ అంతే, ముఖ్య అసోసియేట్ అయినా కూడా. అది 'శ్రీకృష్ణార్జున యుద్ధం' మొదటి పాట రికార్డింగ్ అన్నమాట.

మా రైలు భీమవరం నుండి నిడదవోలు మీదుగా వెళ్ళి మర్నాడు పొద్దున్న గూడూరు చేరుకుంది. నేను యధాలాపంగా మా బావగారు వచ్చి వుంటారని కిటికీలోంచి తొంగి చూశాను. అరె! మావారు. వాళ్ళ అన్న పక్కనే నిల్చొని దిగే జనాన్ని చూస్తున్నారు. కిందకి దిగి "అమ్మయ్య వచ్చారా! మీరు వస్తారో లేదో అని దిగులు పడ్డాను." అంటూ సంతోషం అణచుకోలేక గడగడ మాట్లాడేస్తున్నాను. ఇంతలో మా నాన్నగారు "అమ్మలూ! సామాన్లన్నీ వచ్చాయో లేదో చూడు!" అన్నారు. మా వారిని చూసిన సంతోషంలో ఆ మాటే మర్చిపోయాను.

తిరుపతిలో పెళ్ళి అవగానే మావారు మద్రాసుకి వెళ్ళిపోయారు. మా నాన్నగారు అందరినీ కొండపైకి పిల్చుకెళ్ళే ఏర్పాట్లు చేసారు, దర్శనం అయ్యాక ఎవరిదారిన వాళ్ళు వెళ్ళిపోయారు. నేను, మా అమ్మ మాత్రం సుశీలతో అత్తవారింటికి కర్నూలు జిల్లాలో ఉన్న ఆలూరికి వెళ్ళి, అక్కడ ఫంక్షన్ చూసుకుని మంత్రాలయం వెళ్ళాము. అక్కడ శ్రీ రాఘవేంద్ర స్వాములవారి దర్శనం చేసుకుని తిరిగి పెళ్ళి కూతుర్ని, పెళ్ళి కొడుకుని పిల్చుకుని భీమవరంలో మర్నాడు రిసెప్షన్ పెట్టుకున్నాము. రెండు రోజుల తర్వాత నేను మద్రాసుకు వచ్చేశాను.

అసలొక విషయం చెప్పడం మర్చిపోయాను. మా పెళ్ళైన దగ్గర్నుంచి మా వారిది ఒకటేమాట. నెలనెలా వచ్చే జీతంలో కొంతైనా ఆస్పత్రి ఖర్చులకోసమని బ్యాంక్‌లో వేస్తుండాలి. జబ్బులు ప్లాన్ చేసి రావుకదా. ఈ విషయం మా వాళ్ళకి చెపితే "ఇదేమిటే, శుభమా అని పెళ్ళి అయిన దగ్గర్నుంచి ఆస్పత్రి ఏమిటే" అనేవారు. కాని మొదటి డెలివరి అయిన తర్వాత నుంచి ఆస్పత్రికి తిరగడంతో సరిపోయింది కదా, ఆయన చాలా ప్రాక్టికల్‌గా అన్నారు. ఇదేకాదు ఆయనకి ఇంకో ఆశయం కూడా వుండేది తెలుసా, ఎలాగైనా స్వంత ఇల్లు కట్టుకోవాలని. ఈ విషయము మా చిన్నాన్నగారికి చెప్తే "అమ్మలూ! మీ వారికి మొదటే ఈ ఆలోచన ఉండడం ఎప్పటికైనా మంచిదే!" అన్నారు. తరువాత ఒకటేమిటి అయిదిళ్ళు కట్టుకున్నాం.

మా సుశీల పెళ్ళికి ముందు సంఘటనలు కొన్ని చెప్పాలి. సి.ఐ.టి నగర్ ఇల్లు మారినపుడు మా అమ్మమ్మ మాతోనే వుండేది కదా! ఆవిడనొకసారి తెలిసిన వాళ్ళింటికి పిల్చుకు వెళ్ళాను. అలాగే కొన్ని పళ్ళు, కూరగాయలు కొని పేవ్‌మెంటు మీద నడుస్తుంటే కొంతమంది బొమ్మలమ్ముతున్నారు. అప్పుడు జ్ఞాపకం వచ్చింది నాకు రెండు రోజుల్లో దసరా వస్తోంది కదా అని. వెంటనే మా అమ్మమ్మ నాలుగు బొమ్మలు కొనిచ్చి "అమ్మలూ! చిన్న బొమ్మల కొలువు పెట్టవే" అంది. సీత, రాము, లక్ష్మణ, ఆంజనేయస్వామి బొమ్మలన్నమాట. యాభైఏళ్ళ నుంచీ నేనింకా ఆ బొమ్మల్ని దసరా కొలువులో పెడ్తూనే వున్నాను ఆవిడ జ్ఞాపకార్థంగా. మధ్యలో ఒకసారి పెయింట్ చేయించాను. కొన్నాళ్ళకి మా అమ్మ, చెల్లెళ్ళిద్దరూ మద్రాసు వచ్చారు. వాళ్ళు మద్రాసు చూడలేదు. ముఖ్యంగా మా చెల్లెళ్ళిద్దరూ మద్రాసు ముఖమే ఎరుగరు. మావారు ఖాళీగా వున్నప్పుడు మ్యూజియం, జూ, బీచ్ అన్నీ చూపించాం. వాళ్ళకిక షూటింగు, స్టూడియో చూపించాలి. మా వారికి ఖాళీలేదు. ఎలా? ఉన్నట్టుండి సూళ్ళూరుపేట నుండి మావారి పాత స్టూడెంట్ కె.వి.కృష్ణయ్య వచ్చాడు. అతన్ని చూచి మా వారు "మా వాళ్ళని షూటింగుకు పిల్చుకెళ్ళవోయ్" అన్నారు. సరే మేమంతా టి.నగర్‌లోని ఎలక్ట్రిక్ ట్రైన్ (లోకల్) ఎక్కి కోడంబాకం స్టేషనులో దిగాము. నేను ఇది రెండవసారి స్టూడియోకి వెళ్ళడం. అక్కడ నుంచి విజయవాహిని ఎంత దూరమో నాకు ఐడియా లేదు. కృష్ణయ్య నాతో "అమ్మా! టాక్సీ చేయించుకుందామా!" అంటే "ఎందుకూ, నడిచేవెళ్దాం" అన్నాను. పాపం గురువుగారి సతీమణి ఒద్దంటే అతనేం చేస్తాడు? మేమంతా నడిచి మొత్తానికి స్టూడియో చేరుకున్నాం. మా చెల్లెళ్ళిద్దరూ ఈ నడకలోనే అలసిపోయారు. ఎలాగైతేనేం, వాళ్ళు షూటింగు చూశారు మొత్తానికి. మా చెల్లెళ్ళు "అక్కా! ఇక మేము షూటింగు చూసింది చాల్లే. ఒక వేళ వెళ్ళినా కృష్ణయ్యగారిని మాత్రం పంపొద్దు" అన్నారు. జరిగింది విని మావారు అతన్ని పట్టుకుని చీవాట్లు పెట్టారు. "నా భార్యకైతే కొత్త, నువ్వెందుకలా చేశావ్?" అనడిగారు. పాపం నిజంగా అతను తను చేసిన పనికి చాలా బాధపడ్డాడు.

ఓసారి నాకు మూడవ నెల అబార్షన్ అయింది. మైలాపూర్ లోని కల్యాణి మిషన్ ఆస్పత్రిలో చేరి ట్రీట్‌మెంటు తీసుకున్నాను. డి.యన్.సి ఆపరేషన్ చెయ్యవలసి వచ్చింది. ఒక వారం రోజులు ఆస్పత్రిలో ఉన్నాను. కానీ నాకు భోజనం ఎలా వస్తుంది? ఇంటి దగ్గర ఎవ్వరూ లేరే. మా అమ్మమ్మ మా అమ్మా వాళ్ళతో వెళ్ళిపోయింది. పొద్దున్న టిఫిను, మధ్యాహ్నం, రాత్రి భోజనం. ఒక మధ్యాహ్నం ఉన్నట్టుండి ఒక భూతంలాంటి క్యారియర్ పట్టుకుని మావారు నాకు భోజనం తెచ్చారు. అక్కడున్న మిగతా వాళ్ళంతా ఇంత పెద్ద క్యారియర్‌లో భోజనం ఏ పేషంటుకు తెస్తున్నారని నిర్ఘాంతపోయారు. నాకు నవ్వొచ్చింది. ఇదేమిటి? ఇంత పెద్ద క్యారియర్ ఎక్కడిది? అనడిగాను. ఆ నవ్వుతో మాటరాలేదు నాకు. మనింట్లో క్యారియర్ లేదుకదా షూటింగులలో ఉపయోగించే క్యారియర్‌ని తెచ్చాను అన్నారు మా వారు. ఈ విషయం తెలిసిన మావారి స్నేహితుడు అమ్మన్న చౌదరి తన అత్తవారిల్లు దగ్గర్లోనే ఉందని చెప్పి భోజనాలు అతనే

ఏర్పాటు చేశాడు. అప్పుడప్పుడు అతని భార్య వచ్చి నాకు కంపెనీ ఇచ్చి కాసేపు మాట్లాడి వెళ్తూ వుండేది. మా రెండవ వెడ్డింగ్ డే ఈ గొడవలతోనే సరిపోయింది.

హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయి ఇంటికి వచ్చిన ఈ విషయం గూడూరుకి తెలిసి మా తోటికోడలు మా మామగారిని పంపించింది. నన్ను గుడూరుకి పిల్చుకురమ్మని. ఈ స్థితిలో దూరప్రయాణం భీమవరం వెళ్ళడం కష్టం అని. కానీ నాకు గూడూరు వెళ్ళడం ఇష్టంలేదు. యిక్కడ కాని, పుట్టింట్లో కాని జరిగినట్లు, నాకు గూడూరులో ఎలా జరుగుతుంది? వెళ్ళనన్నాను. కానీ మా వారు నా మనసు అర్థం చేసుకోలేదు. తనకి పగలంతా ఆఫీసులోనే సరిపోతుంది, వండివార్చడానికి, నన్ను చూసుకోడానికి ఎవ్వరూ ఉండరని వారి బాధ. కానీ నేనిక్కడ ఫ్రీగా వుండాలంటే నువ్వు వెళ్ళకపోతే నేనాఫీసులో నిశ్చింతగా ఎలా పనిచేసుకుంటాను, వెళ్ళి తీరాల్సిందే అన్నారు. తప్పనిసరిగా వెళ్ళాను. వీలున్నప్పుడల్లా ఆయన కూడా వస్తుండే వారనుకోండి.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments